# స్వర్గంలో సమానత్వం

చుట్టూ కొండలూ, చెట్లూ వున్నాయి అదో పెద్ద అరణ్యం. ఆ మధ్య ఓ చిన్న పర్ణశాల అక్కడొక రావిచెట్టు క్రింద తిన్నె, ఆ తిన్నెమీద మహా ఘోరంగా తపస్సు చేస్తున్న "నేను" సమాధిలో నుండి ప్రపంచంలో పడ్డ తర్వాత 'మేనక' వచ్చిందని ఎన్నో విధాల నన్ను లొంగదియ్యడానికి ప్రయత్నించి విసిగి వెళ్ళిపోయిందని యోగ శక్తివల్ల తెలిసింది. అంతకంతకీ నా తపస్సు యింద్రుడికీ వాళ్ళకీ భరించరానిదై పోయింది. ఇంక లాభం లేదని ఓ దేవుణ్ణి నా దగ్గరికి పంపించారు. 'వరాలు' మూట కట్టి వదిలించుకుందామని.

ఒక్కసారి నా రెండు కళ్ళు ఎల్లో ఆకర్, వెర్మిలియన్ రెడ్డూ, కోబాల్టు బ్లూ కలిపితే రంగు ఎలా వుంటుందో అలా జిగ్ మన్నాయి, మెల్లగా నా కళ్ళ ముందు ఓ విగ్రహం లాంటి దేవత ప్రత్యక్షమయ్యాడు. అతను ఏ దేవుడో చెప్పలేను. ఎంచేత అంటే ఒకరిగురించి అని నే తపస్సు చేయలేదు కాబట్టి.

ఆ విగ్రహం లాంటి మనిషికి పదిహేను శిరస్సు లుంటాయి! ఒకటి రాముడు లాగా, మరోటి కృష్ణుడి లాగా యింకోటి ఈశ్వరుడిలాగా, మరోటి బ్రహ్మలాగా యిలా అందరి దేవుళ్ళవీ వరుసగా వున్నాయి! నుదుటి మీద అన్ని రకాల నామాలూ అంటే, అడ్డనామాలూ, నిలువునామాలూ, అందరి దేవుళ్ళవి కలిపి అన్నమాట! మెడలో పాములు, పుష్పాల దండలూ, రుద్రాక్ష దండలూ, బంగారం గొలుసులూ అన్నీ వున్నాయి. ఎన్ని చేతులున్నాయో లెక్క పెట్టలేదు కాని ఓ చేతిలో గద, ఓ చేతిలో పద్మం, మరో చేతిలో వీణ ఇంకో చేతిలో తెగగొట్టిన మనిషి తల యిలా అన్ని చేతుల్లోనూ వున్నాయి. ఓ పాదానికి పట్టీలు, పారాయణాలూ, మరో పాదానికి పాంకోడూ వున్నాయి. నాకు తెలిసినంతమట్టుకి, నే చూసినంత మట్టుకి ఆకారం అంతా సరిగ్గా యిలాగే వుంది.

విష్ చేయకపోతే ఏమనుకుంటాడో అని నమస్కారం చేశాను, అతను ముసి ముసి నవ్వు పారేసి, చెయ్యి ముందుకి చాచి రెండుసార్లు కిందకీ, మీదకీ వూపి, "నీ భక్తికి మెచ్చి మనం ప్రత్యక్షమయేం! ఏం కావాలో కోరుకో" అన్నాడు.

ఆ బహువచన ప్రయోగం విని వెనకాల ఇంకెవరైనా వున్నారేమో అని చూసేను కాని, ఎవరూ లేరు. ఇదంతా 'రోయల్ వుయ్' కాబోలనుకొని ఏమిటి అడగడమా అని ఆలోచించాను. ఎప్పటికీ తోచలేదు! ఏదో మంచిది అడిగేయాలి. ఆ మంచిదేదో సమయానికి చిక్కుపెడుతోంది! ఏనాటికీ

అరగని నిక్షేపం అడగడమా ? ఏదనుకుంటే అది అయిపోవాలని గారడీవాళ్ళలా అడగడమా ? సినిమా స్టారు అయిపోవాలని అడగడమా ? కాళిదాసులాటి మహాకవిని అయిపోవాలని అడగడమా ? 'లియోనార్డ్ డావిన్సీ' లాటి చిత్రకారుణ్ణి అయిపోవాలని అడగడమా ? గొప్ప బ్లాక్ మార్కెటీర్ అయిపోవాలని అడగడమా ? ఏమిటి అడగడం ? ఇన్నీ ఇచ్చేస్తే బావుణ్ణు కాని అసలుకే లేదని పొమ్మంటే ? అని ఆలోచిస్తూండగా.

''మిస్టర్! అప్పుడే తొమ్మిది నిముషాలైంది. వేగిరం అడుగు. మనం పోవాలి'' అన్నాడు ఓ చేతికున్న రిస్టువాచీ చూస్తూ.

అబ్బో రిస్టువాచీ కూడా వుందే! అయితే ఇరవైయ్యో శతాబ్దపు దేముడు కూడా ఇందులో వున్నాడన్నమాట అని అనుకున్నాను. స్వర్గం, స్వర్గం అంటారు అదేదో చూద్దామనిపించింది. అది అడగేస్తే తక్కినకోర్కెలో ? పోనీ స్వర్గం వరకూ వెనకాలే ఎలాగో వెడతాం. అంతసేపూ 'తైరు' కొట్టి అవి కూడా లాగొచ్చు అని టుపుక్కున 'స్వర్గం కావాలి' అని అడిగేశాను.

'అయితే సరే యిచ్చేసాం!' అని కొంప మునిగిపోయినట్టు మాయం అయిపోయాడు. నేను గాభరా ఎత్తిపోయి అటూ యిటూ చూస్తుండేటంతలో 'రంయ్'మని గాలి వచ్చి ఎగరగొట్టుకు వెళ్ళి స్వర్గంలో 'ఢబీ'మని ఎత్తి కుదేసింది. ఆతర్వాత పావుఘంట గింజుకుంటేగాని లేవలేకపోయాను.

లేచి అటూ యిటూ చూసేసరికి ఓరి బాబూ! నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. ఆ భవనాలూ, ఆ రోడ్లూ, ఆ వనాంతర సీమలూ అత్యద్భుతంగా వున్నాయి. అక్కడ మనుష్యులు కాదు - కాదు - దేవతలు ఎంత లావణ్యంగా అందంగా వున్నారో చెప్పలేను.

ఆ చుట్టు ప్రక్కల ట్రాములూ, కారులూ, బస్సులూ, బళ్ళూ అని చెప్పలేనుగాని అలాటివే అటూ యిటూ పోతున్నాయి. వైర్లూ, గీర్లూ లేకుండానే లైట్లు రంగురంగులు వెలిగిపోతున్నాయి. దుఖాణాలు కూడా వున్నాయి. కాని, ఎవరూ డబ్బు యిచ్చి కొన్నట్టు లేదు. ఇలా వెళ్లడం వాళ్ళకి కావలసినవి తీసుకుపోవడం అంతే! ఏవో మీద నుండి విమానాల్లాటివి, కొన్ని హంసల్లాగా, కొన్ని చిలకల్లాగా వుండి ఎగిరిపోతున్నాయి. అంతా బంగారం మయంలా వుంది. అవే కాబోలు పుష్పక విమానాలు! ఇలా వుంటుంది కాబట్టే దాన్ని స్వర్గం అన్నారు.

ఇంక తాపీగా లేవబోయాను. ఇంతలో ఎవరో నల్గురు వచ్చి నన్ను ఓ రథం ఎక్కించి తీసుకుపోతున్నారు, వాళ్ళేమిటో, వాళ్ళ భాష ఏమిటో నా కర్థం కాలేదు. నాకో మూలనుండి బితుగ్గా వుంది ఏం చేస్తారో అని! కొంతసేపటికి ఆ రథం ఓ పెద్ద భవనం ముందు ఆగింది. ఆ భవనం చుట్టూ (గేట్ చైనా వాల్' లాటి ప్రహారీ గోడ వుంది. చుట్టూ మనకు తెలియని మొక్కలూ, వృక్షాలూ వున్నాయి. స్వర్గంలోకల్లా అదే గొప్పదేమో సరే యిదేదో యీ లోకంలోని 'స్టూడియో' అయివుంటుందను కున్నాను. నన్ను లోనికి మర్యాదగానే తీసుకు వెళ్లేరు. మన కవులందరూ ఏదో మయసభ అనీ, ఇదనీ, అదనీ వర్ణిస్తారు. కాని అదంతా ఇప్పుడు నేను చూస్తున్నాను. ఆ లోపల చెక్కబడిన శిల్పాలూ, వ్రాయబడిన చిత్రాలూ, ఏ వ్యక్తీ సృష్టించలేడు. వాళ్ళు దేవతలు కాబట్టి సృష్టించి వుండొచ్చు అనుకున్నాను. వీళ్ళ వెనకాలే నేను వెళుతున్నాను కాబట్టి సరిపోయింది. కాని,

లేకపోతే అక్కణ్ణుండి దారితెలీక, నగుబాటు పాలయి వుండేవాడిని.

కొంతసేపటికి నన్ను ఓ పెద్ద సభలోకి తీసుకువెళ్ళేరు. ఎదురుగుండా సింహాసనం మీద ఎవరో కూర్చొని ఉన్నారు. 'జయం! జయం!! మహేంద్ర చక్రవర్తికి జయం!!!' అంటూ భటులు పొగిడేరు. ఐతే యిది ఇంద్రభవనం కాబోలు, అందుకే యింత దీటుగా వుంది అనుకున్నాను.

'నువ్వేనా ఆ తపస్వివి? ఏం కావలసి వచ్చేవ్?' అని ఇంద్రుడు నన్నడిగేడు. ''స్వర్గం చూద్దామని' బెక్కుతూ బెంగలో అన్నాను. ''ఐతే సరే యిదిగో ఈ వుంగరం పెట్టుకొని నీ ఇష్టం వచ్చినట్టు తిరగవచ్చు. నీకు సమానత్వం ప్రసాదిస్తున్నాను.'' అన్నాడు. సరేనని ఆ వుంగరం పెట్టుగు యివాతలికి వచ్చేసేను.

ఆశ్చర్యం! ఆ ఉంగరం పెట్టుకొనేసరికి దేవతలలాగే నేనూ నడవగల్గేను. వారి భాష అర్థమవుతూంది. వారితో మాట్లాడగలుగుతున్నాను కూడాను. బలేబావుంది అనుకొని తిరగడానికి బయలుదేరాను. తర్వాత ఓ యిద్దరు స్నేహితులు కూడా దొరికారు. ఒక్క నిముషం కూడా నన్ను వదిలేవారు కారు. ఎందుకింతలా పొత్తు కుదిరిందో బోధపడలేదు. పూర్వ జన్మాన్ని ఏం ఋణం పడ్డామో! ఏమో! పోనీ మన సొమ్మేం పోవాలని వూరుకున్నాను. నా ఖర్మానాలా వచ్చిన వారేమో!

ముగ్గురం షికారుకు బయలుదేరినాం. నేను చూడని ఎన్నో వీధులు తెగ తిప్పారు. అలా వెళుతూంటే ఓ పెద్ద వీధిలోకి వెళ్ళాం. ఆ వీధి సౌందర్యం ఇలా అని చెప్పలేను, ఆ మేడల నిండా మాణిక్యాలు, రత్నాలు స్థాపితం చేసి వున్నాయి. ఏ మేడ ఎవరిదో పోల్చుకోలేకుండా అన్నీ ఒక్కలాగే వున్నాయి. బహుశా స్వర్గంలోకల్లా ఆ వీధే సౌందర్యాన్ని మించిపోయిందేమో!

ప్రతీ మేడ ముందు 'రంభ, ఊర్వశి, మేనక ఇలా అప్సరసల అందరిపేర్లూ చెక్కబడివున్నాయి. నా కెంచేతో వాళ్లందర్నీ చూడాలనిపించింది. అదీ కాక కష్టపడి స్వర్గం వచ్చి అప్సరసల్ని చూడకండా వెళ్లడమా! వాళ్ళని, చూడకుండా వెళ్ళిపోడానికి మనసు ఒప్పలేదు. నా స్నేహితులతో ఆ సంగతి చెప్పేను. కాని అలా ప్రతీ యింటికీ వెళ్ళి చూస్తే బావుండదనీ, ఆ మర్నాడు ఇంద్ర సభలో వాళ్ళ నాట్య ప్రదర్శనం వుందని అప్పుడు చూడవచ్చనీ చెప్పేరు. అప్పుడైతే అందర్నీ ఒక్కసారే చూడవచ్చు మరీ బావుంటుందని తిరిగి వచ్చేశాం.

మేము వెళ్ళేసరికి ఇంద్ర సభ అంతా కిటకిటలాడుతూంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది ఏ ఎడ్వర్‌టైజ్‌మెంటూ లేకుండా యింతమందికి ఎలా తెలిసిపోయిందో అని! నాట్యం ప్రారంభమయింది! 'ఆర్కెస్ట్రా' ఎక్కడుందో కాని ఎక్కడా కనపడలేదు. కాని వాయిద్యం మాత్రం శ్రావ్యంగా వినపడుతూంది. అప్సరసలందరూ వేదిక ఎక్కేసరికి కళ్ళు జిగేల్‌మన్నాయి. అందరూ ఒకర్ని మించినట్టు ఒకరున్నారు. ఆ అందం ఆ తీరూ ఆ వంపులూ అబ్బబ్బ! ఏ కవీ వున్నదున్నట్టు వర్ణించలేడు. నాకింక ఆ కుర్చీమీద కూర్చోవాలనిపించలేదు. గబుక్కని నిలబడి పోయాను. నా ఫ్రెండు 'కూర్చోవోయ్' అని భుజం వంచి కూర్చోపెట్టేడు. ''ఓహో యిక్కడ యింకా మనలాంటి జనం వున్నారు కదూ!'' అనుకొని కూర్చున్నాను. ఆఖర్ని తెరజారిన తర్వాత ఒక్కొక్కరూ వచ్చి నమస్కరిస్తున్నారు. వెనకనుంచి ఎవరో రంభ, మేనక అని యిలా ఒక్కొక్కరినీ పరిచయం చేస్తున్నారు.

అందరిలోనూ రంభ కొంచెం చిన్నదిలా అవుపించింది. అదేమిటో మరి ఆ రంభని చూడగానే తక్కిన వాళ్లెవ్వరూ గుర్తుకే రాలేదు! ఆమెని చూసిన తర్వాత నిద్రపట్టింది కాదు... కాని ఎలాగ? మనలాంటి వాడెక్కడ? రంభ ఎక్కడ? అయినా మనకు సమానత్వం ఇచ్చాడు, అదీ కాక ఆపాటి తపశ్శక్తి వుంది. అది ఉపయోగించి చూద్దాం అనుకొని

'ఆ రాత్రి బాగా ముస్తాబై అప్సరసల వీధికి వెళ్లాను. రంభ యింటికి వెళ్ళి తలుపు కొట్టేను. ఎవరో వచ్చి తలుపు తీసి -

'ఎవరు మీరు'

'నేనా! నేనొక విటుణ్ణి'

'కొత్తవారిలా వున్నారే, స్వర్గంలో ఆచారాలు తెలియనట్టున్నాయి!'

'అంటే'

'స్వర్గంలో ప్రతీవారికీ రంభ లభ్యమవుతుందని అనుకున్నారా?'

'ఏం! ఎందువల్ల?'

'ఆపాటి తెలీదూ'

'ఇంతకీ నీవెవరు'

'చెలికత్తెని'

'సరే రంభని పిలువు'

'ఏమిటా అదమాయింపు? అధికారం? వీల్లేదు. వెళ్ళండి'

'ఇదిగో నేనెవర్నో తెలుసా'

'మీరే చెప్పేరుగా విటుణ్ణని'

'అయితే విను - ఇంద్రపదవి కోసం తపస్సు చేసి కనికరించి ఇంద్రుణ్ణి యింకా ఆ స్థానంలో ఉంచి యిలా వచ్చినవాడిని'

'అయితే మీరు తపోనిధులా?'

'ఆc! - మరి?'

ఈ మాట వినగానే ఎందుచేతో నన్ను లోనికి తీసుకువెళ్ళి ఆసనం చూపించి వెళ్ళింది. శపిస్తానని భయం కాబోలు. మరికొంతసేపటికి రంభ వచ్చి దగ్గరగా మరో ఆసనంలో కూర్చుంది!

'మహాశయా నమస్కారం! మీరు ఎవరో కారణం వుంటేనేగాని యిలా రారు!' అని అడిగింది.

'తపస్వి. మీబోంట్ల యింటికి ఎందుకు వస్తారో అందుకే'

'ఓహో! మొన్న మేనక నాట్యం చేసి లాభం లేదని వచ్చింది మీ దగ్గరకేనా?'

'ఆc! అవును! నేనే!'

'అవుతే యిలా వచ్చేరేం -'

'నిన్న నాట్యంలో నిన్ను చూసిన నుండి నీ దగ్గరకు రావాలని నీ పొందు కావాలని వచ్చేను'

'తపోనిధులు! మీకెందుకు కిలాంటి కోరిక పుట్టిందో!'

'ఆ తపస్సంతా నీ కొరకే కదూ!'

'ఆ! అలా అంటారేం మేనకనంటిది వస్తే కాదన్నారే. యిప్పుడిలా అంటున్నారే!'

'ఏమో నిన్ను చూస్తే నాకలా అనిపిస్తూంది!'

'క్షమించండి. మీ తపస్సంతా వృధా అయిపోతుంది!'

అది విని యిదేమిటి రంభకింత వేదాంతం పుట్టిందని నాలో అనుకొని -

'నీకోసం నా తపస్సే కాదు... ప్రాణాన్ని అయినా యిస్తాను! సరేనా!'

'మీలాటి మహానుభావులే యిలా అంటే నాబోటిదేం చెయ్యగలదు' అని ఆసనం నుండి లేచి నన్ను లోనికి ఆహ్వానించింది.

నేను ఆమె వెనకాల వెళ్ళి విచిత్రాలన్నీ చూస్తున్నాను. కాని 'ఇంత వేగిరం రంభ ఒప్పుకుంధికి కారణం తెలియక ఆశ్చర్యపోయాను. బహుశా శపిస్తానేమో అని భయం వల్ల ఒప్పుకుందని అనుకొని రంభని అనుసరించేను. ఆఖరికి రంభ పడకగదిలోనికి తీసుకువెళ్లి హంసతూలికా తల్పం మీద కూర్చోబెట్టి అమృతం యిచ్చింది.! ఆగది చూస్తేనే చాలు. అపూర్వమయిన ఆనందం కలిగింది. ఆ గదికి నాల్గు ప్రక్కలా గోడలకి బదులు అద్దాలు అమర్చబడి వున్నాయి. వాటి చుట్టూ అనేక రకాల చిత్రాలు చెక్కబడి వున్నాయి. బంగారంతో చేయబడిన మంచం గదికి మధ్యగా వుంది. దానిమీద చేయబడిన శిల్ప నైపుణ్యం వర్ణించలేం. ఆడ, మొగ, నగ్న చిత్రాలు ఎంతో అందంగా వున్నాయి. వాటిని చూస్తే జీవంతో ఉన్నవేనా అని అనిపిస్తుంది! ఎటు ప్రక్క చూసినా ఆ మంచం మీదనున్న రసికులు తప్ప మరే వస్తువా అవుపించదు! అంత అందంగా వున్న ఆ గదిలో..... నేను రంభతో!! ఆ నాదే భాగ్యం అనుకున్నాను!

ఆనందంగా రంభతో గడిపి యివతలకి వచ్చేను.

ఆ వీధికి ఒక ప్రక్క అప్సరసల యిళ్ళు వరుసగా వుంటే - రెండో ప్రక్క దేవపురుషుల యిళ్ళు వరసగా వున్నాయి.

ఒక్కొక్క యింటి ముందూ వసంతుడు, జయంతుడు, మన్మధుడు, నలకూబరుడు యిలా రాసి వున్నాయి.

ఆశ్చర్యపోతూ అలా నేను చూస్తూ వుంటే కొంత మంది మానవ స్త్రీలు ఆ యిళ్లలోకి వెళుతున్నారు!

''ఇదేమిటి యీ ఆడవాళ్లు అప్సరసల యిళ్ళకు వెళ్ళకుండా దేవతా పురుషుల యిళ్ళకు వెళుతున్నారు? అని అనుకొంటూ వుంటే - నా భార్య లాగే వున్న ఒక స్త్రీ ''మన్మధుని'' యింటిలోకి వెళుతూంది!

నేను అనుమానంతో గబగబా వెళ్లి చూద్దును కదా! అనుమానం లేదు! ఆమె నా భార్యే 'అమ్మమ్మమ్మా! ఎంత ధైర్యం? ఎంత ద్రోహం? ఎంత బరి తెగించింది! యిలా పరాయి మొగాడి యింట్లోకి వెళుతుందా? అయినా నా భార్య ఏమిటి? యిక్కడికి రావడం ఏమిటి? నేను పొరపడి వుంటాను? అని అనుకుంటూ అక్కడ వున్న సేవకులని -

"ఏమిటిరా యీ యిళ్ళలోకి మానవస్త్రీలు వెళుతున్నారు? మాట్లాడానికా?" అని అడిగేను.

"మీరెందుకు ఆ అప్సరసల యిళ్ళకు వెళ్లేరు?... సరిగ్గా అందుకే! భూలోకంలో తపస్సు చేసి మీరు ఇంద్రలోకంలో స్వర్గసుఖాలను కోరుకుంటున్నట్టే - మీ స్త్రీలు కూడా యిప్పుడు తపస్సు చేసి ఇంద్రలోకంకి వచ్చి యిలా స్వర్గసుఖాలను అనుభవిస్తున్నారు." అని చెప్పేసరికి, ఆ మాట వినీ నా తల తిరిగిపోయింది. - ఒక్కసారి గట్టిగా "జయా! జయా!! ఆగు! ఆగు! . అని అరిచాను ..

"ఏమండీ...ఏమండీ... ఏమిటలా అరుస్తున్నారు?.. ఏదయినా కల వచ్చిందా!" అని లేపుతూ జయ - అడిగింది.

"ఇదంతా కలా .... అమ్మయ్య!.." అని ఊపిరి పీల్చుకున్నాను.

కల యిలా వచ్చిందని చెపుతే యింకేమున్నా వుందా? మీరు కోరుకున్నట్టుగానే మేమూ కోరుకోవడంలో తప్పేం వుంది? అని అడిగితే ఏమిటి జవాబు!

★ ★ ★

(- ప్రశాంతి, 1-8-1951.)